క్లుప్తంగా

ఉంగుటూరు నియోజకవర్గంలో పోలింగ్ శాతం 87.75

ఉంగుటూరు : నియోజకవర్గంలో పోలింగ్ సరళిని ఆర్వో ఎస్ఎస్కే ఖాజావలి సోమవారం రాత్రి తెలిపారు. మొత్తం ఓటర్ల సంఖ్య 2,06,437లో పోలైన ఓట్ల సంఖ్య 1,81,156 కాగా ఓటింగ్ శాతం 87.75 నమోదైందని తెలిపారు. దీనిలో మొత్తం పురుష ఓటర్ల సంఖ్య 1,01,545లో 90,546 ఓట్లు పోలవడంతో 89.17 శాతం నమోదైంది.మొత్తం మహిళా ఓటర్ల సంఖ్య 1,04,886లో 90,605 ఓట్లు పోలవడంతో 86.38 శాతం, ట్రాన్స్‌జెండర్లు 6 ఓట్లకు 5 ఓట్లు పోలవడంతో 83.33 శాతం పోలింగ్ నమోదైందని తెలిపారు.

విరిగిన విద్యుత్ స్తంభం



దోసపాడులో విరిగిన విద్యుత్ స్తంభం

దెందులూరు: దోసపాడులోని రామాలయం సమీపంలో రోడ్డు పక్కన విద్యుత్ స్తంభం విరిగింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. స్థానిక ఎంపీటీసీ వైఎస్సార్‌సీపీ మహిళా నేత పెద్దిశెట్టి రోహిణి, మండల విద్యుత్ శాఖ ఏఈకి ఫోన్ చేసి ఈ విషయం తెలియజేశారు. వెంటనే స్పందించిన లైన్‌మెన్ విద్యుత్ తీగలను తాత్కాలికంగా ట్రాన్స్‌ఫార్మర్ పక్కన విద్యుత్ వైర్లకు కలిపారు. విరిగిన విద్యుత్ స్తంభం స్థానంలో నూతన స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ కోరారు.

పోలింగ్ సరళి పరిశీలన

భీమడోలు: భీమడోలు అరుంధతీ, ఆర్జావారిగూడెం పోలింగ్ కేంద్రాలను ఎన్నికల పోలింగ్ సరళిని ఉంగుటూరు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు డాక్టర్ కృష్ణకాంత్ పాఠక్ పరిశీలించారు. ముందుగా క్యూ లైన్‌లో ఉన్న ఓటర్లను పలకరించి ఇక్కడ సదుపాయాలు ఏ విధంగా ఉన్నాయని వారి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ పీవో వద్దకు వెళ్లి పోలింగ్ ప్రక్రియ వివరాలు అడిగి తెలుసుకుని, ఏర్పాట్లు పరిశీలించారు. తొలుత పోలింగ్ కేంద్రాల్లోని రిజస్టర్లను ఆయన పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేసారు. ఎన్నికలను సజావుగా ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎక్కడ అలసత్వం వహించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వరహాలయ్య, ఆర్ఐ కిరణకుమారి, వీఆర్వో వెజ్జు వినయ్, సిబ్బంది పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించిన 'నవోదయ'

పెదవేగి : పెదవేగిలోని జవహర్ నవోదయ విద్యాలయం నూరుశాతం ఉత్తీర్ణతతో అగ్రగామిగా నిలిచిందని ప్రిన్సిపాల్ వైఎస్ఎస్ చంద్రశేఖర్ తెలిపారు. సీబీఎస్ఈ పదవ తరగతి ఫలితాలు సోమవారం విడుదలయ్యాయని ఆయన పేర్కొన్నారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నవోదయ విద్యాలయాలు మొత్తం 86 శాతంతో ఉత్తమంగా నిలిచాయని ఆయన చెప్పారు. పెదవేగి నవోదయ విద్యాలయం ఫలితాల్లో మొట్టమొదటి వరుసలో నిలిచిందని ఆయన తెలిపారు. మొత్తం 80 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణత సాధించి వంద శాతం ఫలితాలతో టాపర్‌గా నిలిచించిందని తెలిపారు. దీనికి సహకరించి, అకుంటిత దీక్షతో కృషి చేసిన ఉపాధ్యాయులను, విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

బారులుతీరిన ఓటర్లు

ఏలూరు రూరల్ : మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. ఇప్పటి వరకు పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు. 64 శాతం పోలింగ్ నమోదైందని, ఇది మరింత శాతం పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. సమయం పూర్తి అయినప్పటికీ శ్రీపర్రులో ఓటర్లు క్యూలో నిలబడ్డారు. చాటపర్రు, శ్రీపర్రు, గుడివాకలంక గ్రామాల్లో ఈవీఎం సిద్ధం చేయడంలో ఆలస్యమై పోలింగ్ సైతం 20 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమయ్యింది. కొమడవోలు పోలింగ్ భూత్‌లో ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్ భేగం, ఎస్ఎంఆర్ పెదబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు ఓటు వేశారు. పలువురు వృద్ధులు సైతం వీల్‌చైర్‌లో పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

టీడీపీ, జనసేన నేతల కవ్వింపు చర్యలు

పలు గ్రామాల్లో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీ నాయకులపై దాడులకు తెగబడే ప్రయత్నం చేశారు. శ్రీపర్రు పోలింగ్ బూత్ వద్ద జనసేన, టీడీపీ నాయకులు హల్‌చల్ చేస్తూ ఓటర్లను భయబ్రాంతులకు గురిచేశారు. దీంతో వైఎస్సార్ సీపీ నాయకుడు మండల కొండలరావు వారిని అడ్డుకున్నారు. లింగారావుగూడెం పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ నాయకులు చాటపర్రు సర్పంచ్ కొరపాటి శ్రీరామ్ ప్రభుదేవ్‌తో పాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులను రెచ్చగొట్టారు. ఇదేమని ప్రశ్నించిన సర్పంచ్ బాబాయ్‌పై దాడిగి తెగబడ్డారు. జాలిపూడి, మాదేపల్లి పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ, జనసేన నాయకులు రెచ్చగొట్టారు. వైఎస్సార్ సీపీ నాయకులు సంయమనం పాటించారు. పోలీసులు రావడంతో టీడీపీ, జనసేన శ్రేణులు అక్కడ నుంచి జారుకున్నారు.

ప్రశాంతంగా సార్వత్రిక ఎన్నికల పోలింగ్

- కుటుంబ సమేతంగా వచ్చి ఓటు హక్కు వినియోగం
- పలు చోట్ల మోరాయించిన ఈవీఎంలు
- రాత్రి 8 గంటల వరకూ కొనసాగిన పోలింగ్

నిడమర్రు: నిడమర్రు మండలంలో 16 గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. బువ్వనపల్లి, అడవికొలను తదితర గ్రామాల్లో ఈవీఎంలు మోరాయించడంతో పోలింగ్ ఆలస్యమైంది. ఉదయం 7 గంటల నుంచే ఓట్లు వేసేందుకు ఓటర్లు బారులు తీరారు. పోలింగ్ సమయం ముగిసినా రాత్రి 9 గంటల వరకూ పలు గ్రామాల్లో పోలింగ్ కొనసాగింది. మహిళా ఓటర్లు భారీగా ఓటు వేసేందుకు తరలివచ్చారు. ఉద్యోగం, వ్యాపారాల నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వృద్ధులు, చంటి పిల్లల తల్లులు సైతం స్వగ్రామాలు వచ్చి ఓటు హక్కును ఉత్సాహంగా వినియోగించుకున్నారు. బువ్వనపల్లిలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కుటుంబం, పత్తేపురంలో కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు, వైఎస్సార్‌సీపీ స్టేట్ బీసీ నాయకులు నౌడు వెంకట రమణ ఓటు హక్కును కుటుంబ సమేతంగా వచ్చి వినియోగించుకున్నారు.

ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులుతీరిన ఓటర్లు

భీమడోలు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. భీమడోలు మండలంలో పలు చోట్ల గడువు సమయం కన్నా రెండు, మూడు గంటల పాటు ఆలస్యంగా పోలింగ్ పూర్తయ్యింది. సార్వత్రిక ఎన్నికల తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎండను సైతం లెక్క చేయకుండా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. మహిళలు అధిక సంఖ్యలో చేరుకోవడంతో కేంద్రాలన్నీ కిటకిటలాడాయి. వృద్ధులు సైతం ఓట్లు వేసేందుకు వచ్చారు. ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమైంది. పూళ్ల ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో రాత్రి 9 గంటల వరకు పోలింగ్ సాగింది. సాయంత్రం ఆరు గంటల తర్వాత క్యూలో ఉన్న ఓటర్లకు కూపన్లు అందించి వారికి ఓటు వేసే అవకాశాన్ని కల్పించారు. పోలింగ్ కేంద్రాల వద్దకు దూర ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లు ఉదయాన్నే ఓటు వేసి తమ స్వగ్రామాలకు తిరిగి వెళ్లాలన్న ఆలోచనలతో ఉదయాన్నే క్యూ కట్టారు. మండలంలోని ఎక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలైన పూళ్ల, ఆర్జావారిగూడెం, గుండుగొలనులోని పూల వీధి, ఆగడాలలంక తదితర ప్రాంతాల్లో పోలింగ్ అలస్యంగా ముగిసింది. మహిళా ఓటర్లు బారులు తీరారు. సిబ్బంది పోలింగ్ సామగ్రిని ఏలూరులోని సీఆర్ రెడ్డి కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు బస్సుల్లో తీసుకుని వెళ్లారు. మండల వ్యాప్తంగా 53 పోలింగ్ కేంద్రాల పరిధిలో 52,933 ఓటర్లకు 80 శాతానికి పైగా పోలింగ్ జరిగినట్లు అధికారులు చెబుతున్నారు.

పోలింగ్ ప్రశాంతం

గుండుగొలను, పూళ్ల, ఎంఎంపురం, భీమడోలు, ఆర్జావారిగూడెం, పెదలింగంపాడు, ఆగడాలలంక తదితర గ్రామాల్లో చెదురుమొదురు ఘటనల మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ, జనసేన, టీడీపీ వర్గీయులు ఒకరినొకరు కవ్వింపు చర్యలకు పాల్పడడంలో అక్కడక్కడ ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. గుండుగొలనులో జనసేన, టీడీపీ వర్గీయులు, వైఎస్సార్‌సీపీ శ్రేణుల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. దీనితో ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. సంతమార్కెట్ పోలింగ్ కేంద్రం సమీపంలో వైఎస్సార్‌సీపీ వర్గీయులకు జనసేన, టీడీపీ వర్గీయుల మధ్య గొడవ జరిగింది. టీడీపీకి చెందిన ఓ వ్యక్తికి తలకు గాయమైంది. దీనితో హుటాహుటిన ఘటన స్థలికి చేరుకుని సీఐ భాస్కర్‌కుమార్, ఎస్సై వై.సుధాకర్ వచ్చి వారిని దూరంగా పంపారు. అదే గ్రామంలో రాత్రి కూడా ఇరు వర్గాల మధ్య కొట్లాట కారణంగా పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు లాఠీ ఝుళిపించారు. ఆగడాలలంకలో లక్ష్మీపురానికి ఆక్వా యాజమాని రాజు కూటమి అభ్యర్థికి అనుకూలంగా ప్రచారం చేయడంతో మహిళలంతా అతన్ని తరిమివేశారు. ఇదే తరహాలో పలు చోట్ల స్వల్ప ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి.



నిడమర్రు: పత్తేపురంలో ఓటు వేసిని ఏపీ బీసీ విభాగం రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి నౌడు వెంకట రమణ దంపతులు



నిడమర్రు: బువ్వనపల్లి సచివాలయం-1 వద్ద బారులు తీరిన ఓటర్లు



భీమడోలు:గుండుగొలను- 23 అంగన్‌వాడీ కేంద్రం పీఎస్ వద్ద వృద్ధ మహిళలకు వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



భీమదోలు అరుంధతీ కాలనీలో ఓట్ల సరళిపై పీవో నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న పరిశీలకులు డాక్టర్ కృష్ణకాంత్ పాఠక్



భీమడోలు: పోలసానిపల్లి-1 స్కూల్లో ఓటు వేసిన సర్పంచ్ షేక్ రహీమాబేగం



భీమడోలు: పూళ్ల ఉన్నత పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఓటర్లు



భీమడోలు: అంబర్‌పేటలో ఓటు వేసేందుకు వీల్‌చైర్‌లో వస్తున్న కొడుదుల బేబి



భీమడోలు: పీఎస్ వద్ద ఒకే ద్వారం ఉండడంతో గుమిగూడిన ఓటర్లు



భీమడోలు బ్రిడ్జి స్కూలు వద్ద ఓ వృద్ధురాలిని ఓటు వేసేందుకు తీసుకుని వెళ్తున్న సిబ్బంది



భీమడోలు: ఓ వృద్ధురాలిని ఎత్తుకుని తీసుకొస్తున్న కుటుంబ సభ్యులు



భీమడోలు: ఉదయం 7.15 నిమిషాలకే బారులు తీరిన ఓటర్లు



పత్తేపురంలో ఓటర్లకు అభివాదం చేస్తున్న ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్



భీమడోలు: పూళ్లలో సాయంత్రం 6గంటల తరువాత బారులు తీరిన జనం

దెందులూరు నియోజకవర్గంలో పోటెత్తిన ఓటర్లు

మహిళలు, వృద్ధులు తరలివచ్చి ఓటు హక్కు వినియోగం

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు సంబంధించి 81 శాతం పోలింగ్ నమోదయింది. గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళలు భారీగా ఓటు హక్కును మండుటెండను సైతం లెక్క చేయకుండా వినియోగించుకున్నారు. ఉదయం 6.45 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. కొవ్వలి, దెందులూరు ఇతర గ్రామాల్లో స్వల్ప ఘర్షణలయ్యాయి. దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్, జాయింట్ కలెక్టర్ బీ లావణ్యవేణి పర్యవేక్షణలో నూజివీడు డీఎస్పీ శ్రీనివాసులు, పెదవేగి సీఐ కే.శ్రీనివాసకుమార్, దెందులూరు ఎస్సై కే.స్వామి ఘర్షణను శాంతింపజేశారు. తాళ్లగూడెంలో నడవలేని వృద్ధురాళ్లను కుటుంబసభ్యులు ఎత్తుకుని పోలింగ్ స్టేషన్లకు తీసుకువచ్చారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలింగ్ స్టేషన్ల ఎదుట బారికేడ్లు, టెంట్లు, వైద్యసదుపాయం ఏర్పాటు చేశారు. మండుటెండలను సైతం లెక్కచేయకుండా ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు పోలింగ్ స్టేషన్‌లో గడువు ముగిసే సరికి ఉన్నవారికి ఓటు వేసుకునే అవకాశం కల్పించారు.

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల పరిశీలన

వైఎస్సార్‌సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ సీతంపేట, శ్రీరామవరం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నానితో కలిసి పరిశీలించారు. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి దెందులూరు, గోపన్నపాలెం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

దూరప్రాంతాలనుంచి తరలివచ్చిన ఓటర్లు

దెందులూరు నియోజకవర్గానికి చెందిన ప్రజలు ఇతర ప్రాంతాలకు వివిధ వృత్తులు, ఉపాధి కోసం వెళ్లిన వారు ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు సోమవారం దెందులూరు నియోకవర్గానికి తరలివచ్చారు. వందలాది మంది వివిధ గ్రామాల్లో తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

జాయింట్ కలెక్టర్, ఆర్వో పరిశీలన

జిల్లా జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి బీ లావణ్యవేణి నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో పోలింగ్ సరళిని, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలించారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో నమోదైన పోలింగ్ గణాంకాలను లెక్కిస్తున్నారు

ఓటు హక్కు వినియోగించుకున్న అబ్బయ్యచౌదరి

పెదవేగి : ప్రతి ఓటరు ఏ ప్రభుత్వాన్ని గెలిపించాలో ముందుగానే సిద్ధమయ్యారని వైఎస్సార్‌సీపీ దెందులూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం కొండలరావుపాలెంలో సోమవారం ఆయన తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కొఠారు రామచంద్రరావు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఆరోగ్య సిబ్బంది వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు.

ఓటు హక్కు వినియోగించుకున్న జెడ్పీ చైర్‌పర్సన్

పెదపాడు: జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తన స్వగ్రామమైన సత్యవోలులో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోమవారం పోలింగ్ బూత్‌కు చేరుకుని ఆమె ఓటు వేసి ఓటర్లను ఉత్సాహ పరిచారు. ఆమె వెంట సర్పంచ్ రంభ ఉమామహేశ్వరి ఉన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు వేసి తమకు రాజ్యాంగం కల్పించిన హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

గంటల తరబడి ఓటర్ల పడిగాపులు

పెదవేగి : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ సోమవారం ముగిసింది. ఎండ తీవ్రత ఇటు సిబ్బందిని, ప్రజలను తీవ్ర అవస్థలకు గురిచేసింది. పెదవేగి మండలంలోని అన్ని గ్రామాల్లో వేకువ జామునే పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఓటర్లు గంటల తరబడి వేచి ఉండలేక కొంత మంది ఇళ్లకు వెళ్లి కొంత సమయం తరువాత వచ్చారు. కొందరు కేంద్రాల వద్దే సీరసించి చతికిలపడ్డారు. ప్రజలు తమకు నచ్చిన నాయకుడికి ఓటు వేసేందుకు పోటీ పడ్డారు. వృద్ధులు, వికలాంగులు, యువత ఉదయమే కేంద్రాలకు వచ్చి క్యూ కట్టారు.

పోలింగ్ కేంద్రాలకు అబ్బయ్యచౌదరి సుడిగాలి పర్యటన

సోమవారం ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో పోలింగ్‌లో పాల్గొని ప్రజాస్వామ్య ప్రక్రియకు పునాదిగా నిలబడిన దెందులూరు నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ధన్యవాదాలు తెలిపారు. ఉదయం నుంచి నాలుగు మండలాల్లోని అనేక గ్రామాల్లో వివిధ పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని అబ్బయ్యచౌదరి పరిశీలించారు. నియోజవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన వైఎస్సార్‌సీపీ నేత సీహెచ్ అశోక్‌గౌడ్ ఓటింగ్ విధానంపై స్థానిక నాయకులను ఆరా తీసారు.





కొండలరావుపాలెంలో ఓటు హక్కును వినియోగించుకుంటున్న అబ్బయ్యచౌదరి, ఓటు హక్కు వినియోగించుకున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కొఠారు రామచంద్రరావు



శ్రీరామవరంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్, కామిరెడ్డి నాని



గోపన్నపాలెంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొఠారు



తాళ్లగూడెంలో వృద్ధురాలిని చేతులపై ఎత్తుకుని తీసుకువస్తున్న కుటుంబ సభ్యులు



దెందులూరు పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలను పరిశీలిస్తున్న జేసీ, ఆర్వో లావణ్యవేణి



తాళ్లగూడెంలో వృద్ధురాలిని బైక్‌పై తీసుకువస్తున్న కుటుంబ సభ్యులు



దెందులూరులో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు



పెదవేగి : ముండూరులో సోమవారం ఉదయమే బారులు తీరిన ప్రజలు



పెదవేగి : భోగాపురంలో ప్రజలకు అభివాదం చేస్తున్న అబ్బయ్యచౌదరి



పెదవేగి : వేగివాడ పంచాయతీ కార్యాలయం వద్ద ఓటు వేసేందుకు వేచి ఉన్న ప్రజలు



పెదవేగి : వైద్య శిబిరం ఏర్పాటుచేసిన దృశ్యం

పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చిన మహిళలు

ఉంగుటూరు: ఉంగుటూరు నియోజకవర్గంలో పోలింగు ప్రశాంతంగా జరిగింది. నియోజకవర్గంలో 87 శాతం పోలింగు నమోదైంది. సోమవారం ఉదయం 7గంటల నుంచే ఓటర్లు తాకిడి ఎక్కువైంది. ఉంగుటూరు, చేబ్రోలు వంటి గ్రామాల్లో ఓటు వేసేందుకు మహిళలు పోటెత్తారు. కొన్ని చోట్ల మిషన్లు మెరాయించడం వంటి కారణాల వల్ల పోలింగ్ ఆలస్యమైంది. దీంతో ఓటర్లు క్యూలైన్లు మరింతగా పెరిగాయి. చేబ్రోలు, వెల్లమిల్లి, చిన్న వెల్లమిల్లి, గోకవరం వంటి గ్రామాల్లో చెదురుమొదురు ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఎన్నికల రిటర్నింగు అధికారి ఖాజావలి, ఉంగుటూరు తహసీల్దారు కార్యాలయం నుంచి పర్యవేక్షించారు. చేబ్రోలు, బాదంపూడి, చేబ్రోలు పోలింగ్ కేంద్రాలకు అంగవైకల్యం, కళ్లులేని వారు వేరొకరి సాయంతో పోలింగు కేంద్రాలకు చేరి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

మొరాయించిన ఈవీఎంలు

గణపవరం మండలం సరిపల్లిలో 199వ పోలింగు కేంద్రం, కేశవరంలో 209వ పోలింగు కేంద్రంలో, కొండేపాడులో 214 పోలింగు కేంద్రంలో వీవీప్యాట్‌లు మెరాయించడంతో వేరొక యంత్రాలను ఏర్పాటు చేశారు. కైకరంలో 62 పోలింగు కేంద్రంలో బీయూ యూనిట్‌లో సమస్య రావడంతో దాన్ని మార్చారు. ఆరు గంటలకు పోలింగు సమయం పూర్తి అయ్యేసరికి ఎవరైతే క్యూలైనులో ఉన్నారో వారందరికీ ఓటు వేసేందుకు అనుమతి ఇచ్చారు.



ఎమ్మెల్యే వాసుబాబు చిన్న వెల్లమిల్లిలో పీవోను పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్న దృశ్యం



చేబ్రోలు వద్ద ఇరువర్గాలు వాగ్వాదం



చేబ్రోలులో ఉదయమే బారులుతీరిన ఓటర్లు